సాక్షి ఆదిలాబాద్

గురువారం । 15 । ఆగస్టు । 2024

I

గరిష్ఠం/కనిష్ఠం
31.0/26.0

వాతావరణం
ఆకాశం మేఘావృతమై ఉంటుంది. పలుచోట్ల ఓ మోస్తరు వర్షం కురిసే అవకాశం ఉంది. గాలిలో తేమశాతం పెరగనుంది.

ఉత్తములు.. 99

- అవార్డుల ఎంపికలో కలెక్టర్ మార్క్
- ఆరు పంచాయతీలకూ పురస్కారం
- నేడు అవార్డుల ప్రదానం

కైలాస్‌నగర్: స్వాతంత్య్ర దినోత్సవం పురస్కరించుని జిల్లా కేంద్రంలో గురువారం నిర్వహించనున్న వేడుకల్లో ఉత్తములకు ప్రశంసపత్రాలు అందజేయనున్నారు. అయితే ఈ సారి పురస్కారాలకు సంబంధించిన ఎంపిక ప్రక్రియ గతానికి భిన్నంగా సాగినట్లుగా తెలుస్తోంది. ఇందుకోసం కలెక్టర్ రాజర్షిషా తన మార్కు ప్రదర్శించారు. అన్ని శాఖల నుంచి ప్రతిపాదనలు స్వీకరించి పనితీరు ప్రమాణికంగానే అవార్డు అందించాలని సంకల్పించారు. ఈ మేరుకు ప్రత్యేక దృష్టి సారించారు. జిల్లా స్థాయి అధికారులు అందించిన జాబితా పూర్తిస్థాయిలో పరిశీలించేందుకు నలుగురు అధికారులతో కూడిన ప్రత్యేక కమిటీని నియమించారు. వీరు ఆయా శాఖల నుంచి అందిన జాబితాలోని ఉద్యోగులకు సంబంధించిన పని తీరుపై సమగ్ర నివేదిక తెప్పించుకున్నారు. విజిలెన్స్ అధికారుల ద్వారా కూడా రహస్యంగా వివరాలు తీసుకొని క్షేత్రస్థాయిలో పరిశీలించారు. అనంతరం 99 మందిని పురస్కారాలకు ఎంపిక చేశారు.

ఎంపికైంది వీరే..
పురస్కారాలకు ఎంపికైన వారిలో 11మంది జిల్లా స్థాయి అధికారులు ఉన్నారు. ప్రధాన శాఖల వారీగా వివరాలు పరిశీలిస్తే అటవీ శాఖలో 11 మంది, పోలీసుశాఖలో 10 మంది, యాపల్‌గూడ సెకండ్ బెటాలియన్‌లో 10 మంది, పంచాయతీరాజ్‌లో ఐదుగురు, వ్యవసాయశాఖలో ఆరుగురు, సీపీడీలో, ఇంటిలిజెన్స్‌లో ముగ్గురు, జైళ్ల శాఖలో ఒకరితో పాటు ఇతర శాఖల్లో మరో 43 మందిని ఎంపిక చేశారు. వీరంతా గురువారం జిల్లా కేంద్రంలోని పరేడ్ మైదానంలో ప్రభుత్వ సలహాదారు షబ్బీర్ అలీ చేతుల మీదుగా పురస్కారం అందుకోనున్నారు.

ఆరు పంచాయతీలకు..

జిల్లాలోని ఆరు గ్రామ పంచాయతీలకు ఉత్తమ పురస్కారాలు దక్కనున్నాయి. ఈ నెల5 నుంచి 9వ తేదీ వరకు నిర్వహించిన స్వచ్ఛదనం-పచ్చదనం అమల్లో ప్రతిభ కనబర్చిన పంచాయతీలకు ఈ అవార్డులను అందజేయనున్నారు. జిల్లాలో 17 మండలాలున్నాయి. ఒక్కో మండలం నుంచి మూడు పంచాయతీలను ఎంపిక చేశారు. ఆయా జీపీల ప్రగతి తీరు స్వచ్ఛతకు చేపట్టిన చర్యల ఆధారంగా మొత్తం 51 పంచాయతీల వివరాలు సేకరించారు. ఇందులో ఉత్తమ పంచాయతీలను డీపీవో, డీఆర్డీవో, అదనపు కలెక్టర్, జెడ్పీ సీఈవోతో కూడిన నలుగురు సభ్యుల బృందం మంగళవారం ఎంపిక చేసింది. వీటిలో ఆదిలాబాద్‌రూరల్ మండలం అంకోలి పంచాయతీ ఉంది. స్పెషల్ ఆఫీసర్ ఎంపీడీవో నాగేశ్వర్‌రెడ్డి అవార్డు అందుకోనున్నారు. అలాగే గాదిగూడ మండలంలోని సావరి పంచాయతీకి సంబంధించి స్పెషలాఫీసర్ ఎంపీవో సాయిప్రసాద్, బజార్‌హత్నూర్ మండలంలోని జాతర్ల పంచాయతీకి సంబంధించి కార్యదర్శి నవనీత, భీంపూర్ మండలం ఇపాని పంచాయతీకి సంబంధించి కార్యదర్శి సునీత, ఇంద్రవెల్లి మండలం ముత్నూరు పంచాయతీకి సంబంధించి కార్యదర్శి విజయకుమార్, నార్నూర్ మండలం బలంపూర్ పంచాయతీ కార్యదర్శి అవినాశ్ ఈ పురస్కారాలు అందుకోనున్నారు.



జాతర్ల పంచాయతీ కార్యాలయం

న్యూస్‌రీల్

జిల్లాకు చేరుకున్న షబ్బీర్ అలీ

- స్వాగతం పలికిన కలెక్టర్, ఎస్పీ



షబ్బీర్‌అలీకి స్వాగతం పలుకుతున్న కలెక్టర్

కైలాస్‌నగర్: పంద్రాగస్టు వేడుకల ముఖ్య అతిథి, రాష్ట్ర ప్రభుత్వ సలహాదారు(ఎస్సీ, ఎస్టీ, బీసీ, మైనార్టీ వెల్ఫేర్) మహ్మద్ షబ్బీర్ అలీ బుధవారం రాత్రి జిల్లా కేంద్రానికి చేరుకున్నారు. పట్టణంలోని పెన్‌గంగ గెస్ట్‌హౌస్‌కు చేరుకున్న ఆయనకు కలెక్టర్ రాజర్షి షా, ఎస్పీ గౌస్ ఆలం పూల మొక్కలు అందజేసి స్వాగతం పలికారు.

మాదకద్రవ్యాలకు దూరంగా ఉండాలి



మాట్లాడుతున్న డీడబ్ల్యూవో సబిత

ఆదిలాబాద్‌టౌన్: విద్యార్థులు మాదకద్రవ్యాలకు దూరంగా ఉండాలని జిల్లా సంక్షేమ అధికారి సబిత అన్నారు. జిల్లా కేంద్రంలోని ప్రభుత్వ ఆర్ట్స్ అండ్ కామర్స్ డిగ్రీ కళాశాలలో బుధవారం అవగాహన సదస్సు నిర్వహించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ, విద్యార్థులు చెడు వ్యసనాలకు అలవాటుపడి విలువైన జీవితాలను నాశనం చేసుకోవద్దని సూచించారు. కష్టపడి చదివి అనుకున్న లక్ష్యాలను నెరవేర్చుకోవాలన్నారు. కార్యక్రమంలో ప్రిన్సిపాల్ అతిక్ బేగం, దేవిదాస్ దేశ్‌పాండే, శ్రీరామ్, కిశోర్ తదితరులు పాల్గొన్నారు.

అప్రమత్తంగా ఉండాలి



మొక్క నాటి నీరు పోస్తున్న ఎస్పీ

ఆదిలాబాద్‌రూరల్: విధి నిర్వహణలో అప్రమత్తంగా ఉండాలని ఎస్పీ గౌస్ ఆలం అన్నారు.ఆదిలాబాద్ రూరల్‌పోలీస్‌స్టేషన్‌ను బుధవారం ఆయన తనిఖీ చేశారు. సర్కిల్ కార్యాలయం, రిసెప్షన్ సెంటర్‌ను పరిశీలించి పెండింగ్ కేసుల వివరాలు అడిగి తెలుసుకున్నారు. స్టేషన్‌కు వచ్చే బాధితులతో మర్యాదపూర్వకంగా వ్యవహరించాలని సిబ్బందికి సూచించారు. అలాగే పరిశుభ్రతపై శ్రద్ధ వహించాలన్నారు. స్టేషన్‌పరిధిలో అసాంఘిక కార్యకలాపాలు రూపుపేలా చర్యలు చేపట్టాలని ఆదేశించారు. అనంతరం స్టేషన్ ఆవరణలో మొక్క నాటారు. లాండసాంగ్వి గ్రామంలోని బ్రిడ్జిని పరిశీలించారు. ఆయన వెంట రూరల్ సీఐ ఫణిందర్, ఎస్సై ముజాహిద్, సిబ్బంది తదితరులు ఉన్నారు.

అవయవదానానికి ముందుకు రావాలి



కలెక్టర్‌కు అశోకచిహ్నం అందజేస్తూ..

కైలాస్‌నగర్: ఆపత్కాలంలో బాధితుల ప్రాణాలు కాపాడేలా సమాజంలోని ప్రతి ఒక్కరూ అవయవదానానికి స్వచ్ఛందంగా ముందుకు రావాలని కలెక్టర్ రాజర్షిషా అన్నారు. అవయవదానం పురస్కరించుకుని జిల్లా యువజన సంఘాల ప్రతినిధులు కలెక్టర్‌ను బుధవారం కలెక్టరేట్‌లో మర్యాదపూర్వకంగా కలిశారు. స్వాతంత్య్ర దినోత్సవం పురస్కరించుకుని కలెక్టర్‌కు అశోక చక్ర చిహ్నం, స్వామి వివేకానందుని చిత్రపటం అందజేశారు. కలెక్టర్ మాట్లాడుతూ, అవయవదానంపై యువతలో ఉన్న అపోహలు దూరం చేయాలని వారికి సూచించారు. ఇందులో యువజన సంఘాల సమితి అధ్యక్షుడు బాలశంకర్ కృష్ణ, సమన్వయకర్తలు రాణప్రతాప్‌సింగ్, సిరాజ్, శ్రీకాంత్, రాజు, అబ్దుల్ అజీజ్, రవికుమార్, వేణు తదితరులున్నారు.

వేడుకలకు సర్వం సిద్ధం



పరేడ్ మైదానాన్ని సిద్ధం చేస్తున్న సిబ్బంది



ఏర్పాట్లను పరిశీలిస్తున్న కలెక్టర్, ఎస్పీ



సిద్ధమైన పరేడ్ మైదానం

- ముస్తాబైన పరేడ్ మైదానం
- పతాకావిష్కరణ చేయనున్న ప్రభుత్వ సలహాదారు షబ్బీర్ అలీ

కైలాస్‌నగర్: పంద్రాగస్టు వేడుకలకు జిల్లా కేంద్రంలోని పోలీస్ పరేడ్ మైదానం ముస్తాబైంది. ఈ మేరకు యంత్రాంగం ఏర్పాట్లలో నిమగ్నమైంది. పోలీసుల కవాతు, విద్యార్థుల సాంస్కృతిక ప్రదర్శనలకు వీలుగా మైదానాన్ని చదును చేసి రంగువల్లులతో తీర్చిదిద్దారు. జాతీయ పతాకం ఆవిష్కరించే ప్రాంతంతో పాటు ముఖ్య అతిథులు ఆసీనుల య్యే వేదికను రంగులతో సుందరీకరించారు. ప్రజాప్రతినిధులు, పుర ప్రముఖులు, అధికారులు కూర్చునేందుకు వీలుగా ప్రత్యేక గ్యాలరీలు ఏర్పాటు చేశారు. సంక్షేమ, అభివృద్ధి కార్యక్రమాల ప్రగతి తెలియజేసేలా స్టాళ్ల ఏర్పాటుకు గాను శాఖల వారీగా టెంట్లు వేశారు. ఉదయం 10గంటలకు నిర్వహించనున్న వేడుకలకు రాష్ట్ర ప్రభుత్వ సలహాదారు మహ్మద్ షబ్బీర్ అలీ ముఖ్య అతిథిగా హాజరుకానున్నారు. జాతీయ పతాకావిష్కరణ అనంతరం పోలీసుల నుంచి గౌరవవందనం స్వీకరిస్తారు. జిల్లా ప్రజలనుద్దేశించి ప్రసంగించనున్నారు. అనంతరం విద్యార్థుల సాంస్కృతిక ప్రదర్శనలు ఉంటాయి. ఉత్తమ సేవలందించిన ఉద్యోగులకు ప్రశంసపత్రాలు అందజేయనున్నారు. ఈ మేరకు ఏర్పాట్లను కలెక్టర్ రాజర్షి షా, ఎస్పీ గౌస్ ఆలంతో కలిసి బుధవారం పరిశీలించారు. ఎలాంటి ఇబ్బందులు తలెత్తకుండా పకడ్బందీ ఏర్పాట్లు చేపట్టాలని అధికారులను ఆదేశించారు. వారి వెంట అదనపు కలెక్టర్ శ్యామలాదేవి, అదనపు ఎస్పీ సురేందర్‌రావు, డీఎంహెచ్‌వో నరేందర్ రాథోడ్, జిల్లా అధికారులు తదితరులున్నారు.



అతిథులు ఆసీనులయ్యే వేదిక



పల్సి(బి) గ్రామ ముఖచిత్రం

ఆదర్శం.. ఈ గ్రామాలు

- మద్యం, మాంసానికి దూరంగా పల్సి(బి), గురుదేవ్‌నగర్
- దేశసేవలో తరిస్తున్న నర్సాపూర్

'గ్రామాలే దేశానికి పట్టుకొమ్మలు' అన్న గాంధీజీ నానుడిని నిజం చేసేలా జిల్లాలోని పలు గ్రామాలు ఆదర్శంగా నిలుస్తున్నాయి. ఏళ్లుగా మద్యం, మాంసానికి దూరంగా ఉంటూ ప్రత్యేకతను చాటుతున్నాయి. ఇందులో తలమడుగు మండలం పల్సి(బి), బోథ్ మండలంలోని గురుదేవ్‌నగర్ ఉన్నాయి. మరో గ్రామం నర్సాపూర్ సైనికులను తీర్చిదిద్దుతూ దేశసేవలో తరిస్తోంది. స్వాతంత్య్ర దినోత్సవం సందర్భంగా ఆయా గ్రామాలపై ఓ లుక్కేద్దాం.

– సాక్షి,ఆదిలాబాద్

మద్యం, మాంసానికి దూరంగా..

- పల్సి(బి) గ్రామస్తులు 27 ఏళ్లుగా మద్యం, మాంసానికి దూరంగా ఉంటున్నారు. గ్రామంలో గతంలో నారాయణ బాబా ఆధ్యాత్మిక వచనాలు కొనసాగించేవారు. ఆయన ప్రేరణతో గ్రామంలో మద్యం, మాంసం నిషేధానికి సమష్టి నిర్ణయం తీసుకున్నారు. అప్పటి నుంచి కొనసాగిస్తున్నారు. గ్రామంలో వృద్ధుల కోసం ప్రత్యేకంగా వృద్ధాశ్రమం కూడా నిర్మించారు. బాబా మరణాంతరం ఊరిలో ఆయన స్మారకార్థం ఆలయం నిర్మించుకున్నారు.
- బోథ్ మండలం మర్లపల్లి గ్రామం వద్ద గురుదేవ్‌నగర్‌లో 66 ఏళ్లుగా మద్యం, మాంసానికి దూరంగా ఉంటున్నారు. గతంలో గంగానంద స్వామి ప్రవచనాలకు ఈ గ్రామస్తులు ఆకర్షితులయ్యారు. అప్పటినుంచి గ్రామంలో మద్యం, మాంసానికి దూరంగా ఉంటున్నారు. ఆ స్వామి మృతి చెందినప్పటికీ ఇప్పటికీ గ్రామస్తులంతా మాటకు కట్టుబడి కొనసాగిస్తున్నారు.
- ఇచ్చోడ మండలం నర్సాపూర్ యువత దేశ సేవలో నిలుస్తుంది. ఈ గ్రామం నుంచి ఏకంగా 85 మంది యువత ఆర్మీ, బీఎస్ఎఫ్‌లో ఉన్నారు. ఒకరిని చూసి ఒకరు దేశ రక్షణ కోసం సైనికులుగా మారుతున్నారు.
- ఇంద్రవెల్లి మండలం అందునాయక్ తండాకు చెందిన గోతి ప్రకాశ్ ఇండియన్ ఆర్మీలో పనిచేస్తూ కార్గిల్ యుద్ధంలో వీరమరణం పొందారు. ఆయన స్మారకార్థం గ్రామంలో విగ్రహం ఏర్పాటు చేసి ఏటా రాఖీ పౌర్ణమి రోజున ఆయన సోదరీమణులతో పాటు పలువురు రాఖీలు కడతారు.

దేశ సేవ కోసమే..



చిన్నప్పటి నుంచి దేశ సేవ చేయాలన్న ఆలోచన ఉండేది. గ్రామానికి చెందిన కొంత మంది ఆర్మీలో చేరారు. వారిని చూసి నాలో పట్టుదల పెరిగింది. కష్టపడి ఆర్మీలో చేరాను. దేశ సేవ కోసం పనిచేయడం సంతోషంగా ఉంది.

– కేంద్రే శ్రీకాంత్, జవాన్, నర్సాపూర్

టి–హబ్‌లో టెస్టులకు బ్రేక్!

- పనిచేయని యంత్రాలు
- నిలిచిన పలు నిర్ధారణ పరీక్షలు
- రోగులకు తప్పని తిప్పలు



టి-హబ్‌లో పనిచేయని యంత్రాలు

ఆదిలాబాద్‌టౌన్: రిమ్స్ ఆవరణలోని టి-హబ్‌లో పలు యంత్రాలు మూడు రోజులుగా పనిచేయడం లేదు. దీంతో థైరాయిడ్, ఎల్ఎఫ్‌టీ, ఆర్ఎఫ్‌టీ, కేఎఫ్‌టీ, ప్రొటీన్ తదితర పరీక్షలు నిలిచిపోయాయి. రిమ్స్‌కు వచ్చే రోగులకు సంబంధించి, ఆయా పీహెచ్‌సీల నుంచి వచ్చిన శాంపిల్స్ పేరుకుపోయాయి. బయోకెమిస్ట్రీలో మూడు నెలలుగా రీఏజెంట్లు లేవు. శాంపిల్స్ అన్ని టి-హబ్‌కు పంపడంతో యంత్రాలపై భారం పడి మొరాయిస్తున్నట్లు సిబ్బంది పేర్కొంటున్నారు. వ్యాధుల సీజన్ కావడంతో జనం రోగాల బారిన పడుతున్నారు. ఆయా ఆస్పత్రుల్లో చికిత్స కోసం వస్తున్న వారికి వైద్యులు పరీక్షలు చేయించాలని సూచిస్తున్నారు. దీంతో రక్త నమూనాలు సేకరించిన సిబ్బంది వాటిని టి-హబ్‌కు పంపిస్తున్నారు. అక్కడ యంత్రాలు మొరాయించడంతో రోగులకు ఇబ్బందులు తప్పడం లేదు. కొంత మంది గత్యంతరం లేక ప్రైవేట్ ల్యాబ్‌లకు వెళ్లి పరీక్షలు చేయించుకుంటున్నట్లు చెబుతున్నారు.

'ఖండాల'కు భగీరథ నీరందేలా చూడాలి



విద్యార్థులకు దుస్తులు పంపిణీ చేస్తున్న కలెక్టర్ రాజర్షి షా

- గ్రామాన్ని సందర్శించిన కలెక్టర్ రాజర్షి షా

ఆదిలాబాద్‌రూరల్: మండలంలోని ఖండాల పంచాయతీకి మిషన్ భగీరథ నీరు సరఫరా అయ్యేలా చూడాలని ఆర్‌డబ్ల్యూఎస్ అధికారులను కలెక్టర్ రాజర్షి షా ఆదేశించారు. మండలంలోని ఖండాల జీపీతో పాటు అనుబంధ గ్రామాలను బుధవారం ఆయన సందర్శించారు. గ్రామానికి మిషన్ భగీరథ నీటిని అందించే మోటార్లు నెల రోజులుగా పనిచేయడం లేదు. వెంటనే కొత్తవాటిని బిగించి నీటి సరఫరా పునరుద్ధరించాలని అధికారులను ఆదేశించారు. గ్రామంలో ఎస్డీఎఫ్ నిధులతో చేపట్టిన తాగు నీటి పైపులైన్, ట్యాంకు, తదితర పనులను పరిశీలించారు. అంగన్‌వాడీ కేంద్రంతో పాటు పోతగూడ-2 గిరిజన ఆశ్రమ పాఠశాలను సందర్శించారు. విద్యార్థుల సమస్యలను అడిగి తెలుసుకున్నారు. వారికి దుస్తులు, షూ పంపిణీ చేశారు. కలెక్టర్ వెంట మండల ప్రత్యేకాధికారి నాగభూషణం, ఆర్‌డబ్ల్యూఎస్ డీఈ దేవయ్య, ఇన్‌చార్జి తహశీల్దార్ సాయి మహేశ్, ఎంపీడీవో నాగేశ్వర్‌రెడ్డి, ఎంపీవో ఆనంద్, పీఆర్ ఏఈ సంతోష్, తదితరులున్నారు.



కొవ్వొత్తులతో నివాళి

కోల్‌కతాలో ఇటీవల జరిగిన ఘటనలో దారుణ హత్యకు గురైన వైద్య విద్యార్థినికి ఐఎంఏ, ఇండియన్ డెంటల్ అసోసియేషన్ ఆధ్వర్యంలో నివాళులర్పించారు. బుధవారం రాత్రి రిమ్స్ మెడికోలతో కలిసి కొవ్వొత్తుల ప్రదర్శన నిర్వహించారు. రెండు నిమిషాలు మౌనం పాటించి ఆమె ఆత్మకు శాంతి చేకూరాలని కోరారు. ఈ ఘటనను తీవ్రంగా ఖండించారు. కారకులను కఠినంగా శిక్షించాలని డిమాండ్ చేశారు. ప్రభుత్వం వైద్యులకు భద్రత కల్పించాలని కోరారు. కార్యక్రమంలో ఐఎంఏ అధ్యక్షుడు అశోక్, వైద్యులు రమ, శ్యామల, అరుణ, సుమలత, ప్రకాశ్, ఇండియన్ డెంటల్ అసోసియేషన్ అధ్యక్షుడు సమీఉద్దీన్, సాయిరాం, మెడికోలు పాల్గొన్నారు.

– ఆదిలాబాద్‌టౌన్

తుది.. మాఫీ

- నేడు మూడో విడత రుణమాఫీ
- రూ.1.51లక్షల నుంచి రూ.2లక్షల వరకు..
- జిల్లాలో సుమారు 25వేల మంది వరకు లబ్ధి




ఆదిలాబాద్‌టౌన్: కాంగ్రెస్ ప్రభుత్వం ఎన్నికల ముందు రైతులకు ఇచ్చిన రుణమాఫీ హామీ అమలు నేటితో పూర్తి కానుంది. రాష్ట్ర సర్కారు ఇప్పటి వరకు రెండు విడతల్లో మాఫీ డబ్బులను అన్నదాతల ఖాతాల్లో జమ చేసింది. సీఎం రేవంత్‌రెడ్డి గురువారం మూడో విడత విడుదల చేయనున్నారు. ఈ సారి రూ.1లక్ష 51వేల నుంచి రూ.2లక్షల వరకు మాఫీ కానుంది. జిల్లాలో దాదాపు 25వేల మంది వరకు ప్రయోజనం దక్కనుంది. అర్హులందరికీ రుణమాఫీ నిధులు జమ చేస్తామని ప్రభుత్వం ఇప్పటికే ప్రకటించింది. రైతులు ఆందోళన చెందాల్సిన అవసరం లేదని స్పష్టం చేసింది.

ఇది వరకే రెండు విడతల్లో..
మొదటి విడత రుణమాఫీ డబ్బులను జూలై 18న ప్రభుత్వం విడుదల చేసింది. ఇందులో 18,821 మంది రైతులకు రుణమాఫీ కాగా 18,353 కుటుంబాలకు ప్రయోజనం చేకూరింది. అన్నదాతల బ్యాంకు ఖాతాల్లో నేరుగా రూ.120.79 కోట్లు జమ చేసింది. రెండో విడత జూలై 30న చేపట్టింది. ఇందులో భాగంగా 17,647 మంది రైతులకు రూ.201.83 కోట్లను విడుదల చేసింది. మూడో విడత రుణమాఫీ స్వాతంత్య్ర దినోత్సవం సందర్భంగా సీఎం రేవంత్‌రెడ్డి ఖమ్మంలో విడుదల చేయనున్నట్లు అధికారులు చెబుతున్నారు. అయితే మూడో విడతలో ఎంత మంది రైతులకు, ఎన్ని నిధులు అనే వివరాలు ఇంకా తెలియరాలేదు. ఇదివరకు వ్యవసాయ శాఖ అధికారులకు ప్రభుత్వం ముందస్తుగానే సమాచారం ఇవ్వగా, ఈవిడతకు సంబంధించి మాత్రం బుధవారం రాత్రి వరకు సమాచారం అందలేదని ఆశాఖ అధికారులు పేర్కొన్నారు. సుమారు 25వేల మంది వరకు ఉండొచ్చని తెలిపారు.

నిధులు జమకాని రైతుల్లో ఆందోళన..
మొదటి, రెండో విడతల్లో కొంత మంది రైతుల ఖాతాల్లో రుణమాఫీ డబ్బులు జమ కాలేదు. దీంతో వారు వ్యవసాయశాఖ అధికారి కార్యాలయం చుట్టూ ప్రదక్షిణలు చేస్తున్నారు. బ్యాంకులకు వెళ్లి డబ్బులు జమ అయ్యాయో, లేదోనని తరచూ చూసుకుంటున్నారు. జిల్లా కేంద్రంలో నోడల్ అధికారిని నియమించినప్పటికీ ఆయన నుంచి రైతులకు స్పష్టమైన వివరాలు అందడం లేదు. దీంతో వారు నిరాశకు లోనవుతున్నారు. ఇప్పటివరకు దాదాపు 600 మంది రైతుల నుంచి ఫిర్యాదులు వచ్చినట్లు ఆ శాఖ అధికారులు పేర్కొంటున్నారు. వ్యవసాయ శాఖ అధికారులు స్పష్టమైన సమాధానం ఇవ్వకపోవడంతో ఎవరికి చెప్పుకోవాలో తెలియక రైతులు తంటాలు పడుతున్నారు. ఆ శాఖ అధికారులు ఆన్‌లైన్‌లో పరిశీలిస్తే టుబి ప్రాసెస్.. డాటా నాట్‌ఫౌండ్, నో రేషన్ కార్డు, ఆధార్ నాట్ మ్యాచ్, రుణం తీసుకున్న వ్యక్తి చనిపోయారని, ఇంట్లో ప్రభుత్వ ఉద్యోగి ఉన్నారని.. ఇలా వివిధ కారణాలతో రుణమాఫీ డబ్బులు జమ కాలేదని రైతులు దిగాలు చెందుతున్నారు. అయితే రుణమాఫీ జమ కాని రైతులు ఆందోళన చెందవద్దని, మూడో విడత తర్వాత రైతుల సమస్యల పరిష్కారానికి కృషి చేస్తామని ఇదివరకే సీఎం రేవంత్ రెడ్డి ప్రకటించారు. కాగా జిల్లాలో దాదాపు 10వేల మంది రైతులకు రెండు విడతల్లో డబ్బులు ఖాతాల్లో జమ కాలేదని సమాచారం.

హైదరాబాద్ తరలిన దుబార్‌పేట్ కళాకారులు

ఇచ్చోడ: హైదరాబాద్‌లో నిర్వహించనున్న పంద్రాగస్టు వేడుకల్లో ప్రదర్శన ఇచ్చేందుకు గాను దుబార్‌పేట్ ఆదివాసీ సకల సంక్షేమ సంఘం కళాకారులకు ఆహ్వానం అందింది. ఈ మేరకు బుధవారం వారు ఇక్కడి నుంచి బయలుదేరి వెళ్లారు. గోల్కొండ కోటలో గురువారం నిర్వహించే కార్యక్రమంలో పాల్గొని గోండి కళారూపాలను ప్రదర్శించనున్నట్లు సంఘం డైరెక్టర్ కాత్లే శ్రీధర్ తెలిపారు. తెలంగాణ భాషా సంస్కృతి వారి ఆహ్వానం మేరకు ప్రదర్శన ఇవ్వనున్నట్లు పేర్కొన్నారు.



రాజధానికి బయలుదేరిన కళాకారులు

సామూహిక జాతీయ గీతాలాపన



జాతీయగీతం ఆలపిస్తున్న విద్యార్థులు

ఉట్నూర్‌రూరల్‌: స్వాతంత్య్ర దినోత్సవాన్ని పురస్కరించుకుని బుధవారం మండల కేంద్రంలోని ఐబీ చౌరస్తాలో సామూహిక జనగణమన జాతీయ గీతాలాపన కార్యక్రమం నిర్వహించారు. బీజేపీ రాష్ట్ర నాయకులు రాథోడ్‌ రితేశ్‌, సీఐ మొగిలి, ఎస్సై మనోహర్‌, ఆయా ప్రజా సంఘాలు, పార్టీల నాయకులు కొండేరి రమేశ్‌, బింగి వెంకటేశ్‌, బొడ్డు కిరణ్‌, తన్నీరు సతీశ్‌, కల్వ రవి, హరిప్రసాద్‌, సాడిగే రాజేశ్వర్‌, వివిధ పాఠశాలల విద్యార్థులతో కలిసి జాతీయ గీతాన్ని ఆలపించారు. కార్యక్రమానికి పట్టణ ప్రజలు, గ్రామ పెద్దలు యువతీ యువకులు అధికసంఖ్యలో హాజరయ్యారు. అనంతరం మండలంలోని గంగాపూర్‌ లో బీజేపీ ఆధ్వర్యంలో హర్‌ఘర్‌ జెండా కార్యక్రమాన్ని పురస్కరించుకుని ఇంటింటికీ జాతీయ జెండాలు పంపిణీ చేశారు.

మెడికోలకు భద్రతెంత?

ఆదిలాబాద్‌టౌన్‌/మంచిర్యాలటౌన్‌: 'వైద్యో నారాయణో హరి' అంటే.. వైద్యుడు దేవునితో సమానమని అర్థం. కళ్లెదుట కనిపించే వైద్యుడినే ఆపదలో ఉన్న వారు దేవునిగా భావిస్తారు. కానీ ఎంతో మంది ప్రాణాలను కాపాడే వైద్యులకు రక్షణ లేకుండా పోతోంది. ఇటీవల కోల్‌కతాలో ఓ వైద్య విద్యార్థిపై అత్యాచారం చేసి హత్య చేసిన ఘటన తెలిసిందే. దీంతో దేశవ్యాప్తంగా వైద్య విద్యార్థులు నిరసన కార్యక్రమాలు చేపడుతున్నారు. ఇటీవల కాలంలో రిమ్స్‌లో ఓ పీజీ వైద్యురాలిపై గైనిక్‌ డిపార్ట్‌మెంట్‌లో మహారాష్ట్రకు చెందిన ఓ మహిళ దాడికి పాల్పడింది. ఇలాంటి ఘటనలు తరచూ చోటు చేసుకుంటూనే ఉన్నాయి. కాగా రిమ్స్‌లో ఏర్పాటు చేసిన సీసీ కెమెరాలను కొంతమంది ధ్వంసం చేయడం, అందులో వీడియో రికార్డు కాకుండా పక్కకు నెట్టేయడం వంటివి చేస్తున్నారు. దీంతో రిమ్స్‌లో మెడికోలకు భద్రత ఎంత? అనే ప్రశ్న తలెత్తుతోంది.

- రిమ్స్‌లో తరచూ చోటు చేసుకుంటున్న ఘటనలు
- నిఘానేత్రాలు ఉన్నా.. పనిచేయని వైనం
- వైద్య విద్యార్థులపై బయటి వ్యక్తుల దాడి
- ఇటీవల కూడా ఓ పీజీ వైద్యురాలిపై ..



కోల్‌కతా ఘటనకు సంబంధించి రిమ్స్‌ డైరెక్టర్‌ చాంబర్‌ ఎదుట నిరసన వ్యక్తం చేస్తున్న మెడికోలు

రిమ్స్‌లో చోటు చేసుకున్న ఘటనలు..

- గతేడాది రిమ్స్‌ వసతిగృహంలో ఉండే మెడికోలపై నలుగురు బయటి వ్యక్తులు దాడికి పాల్పడ్డారు. వైద్య విద్యార్థులను వాహనంతో ఢీకొట్టేందుకు యత్నించినట్లు అక్కడి సీసీ కెమెరాల్లో రికార్డు అయ్యింది.
- గతేడాది బాలికల వసతిగృహం వెనుక వైపు నుంచి పైపు సహాయంతో కొందరు వ్యక్తులు లోనికి వెళ్లేందుకు యత్నించారు. గమనించిన మెడికోలు కేకలు వేయడంతో పరారయ్యారు.
- పక్షం రోజుల క్రితం రిమ్స్‌ న్యూ క్వార్టర్స్‌లో చెత్త ఏరుకునేవారు మహిళా పీజీలు ఉండే రూమ్‌ తలుపు తట్టడంతో భయాందోళనకు గురయ్యారు. బయటకు వచ్చి చూసే సరికి వారు పరారయ్యారు.
- గత నెలలో గైనిక్‌ వార్డులో మహారాష్ట్రకు చెందిన బాలింత వెంబడి వచ్చిన సహాయకురాలు పీజీ వైద్యురాలితో వాగ్వివాదానికి దిగి ఆమెపై చేయి చేసుకున్నారు. ఈ విషయంలో ఇద్దరు సెక్యూరిటీ గార్డులను సస్పెండ్‌ చేశారు.
- గత నెల ఓ పీజీ వైద్యుడు రిమ్స్‌లో చదివే మెడికోను తన వాహనంలో ఎక్కించుకుని కలెక్టర్‌ చౌక్‌లో ఆమెపై చేయి చేసుకున్నాడు. దీంతో బాధితురాలు తండ్రితో కలిసి టూటౌన్‌లో ఫిర్యాదు చేసింది.
- రిమ్స్‌ వసతిగృహంతో పాటు ఆయా వార్డుల్లోని సెల్‌ఫోన్లు, మోటార్‌ సైకిళ్లు, ఆటోలు, ఇతర వస్తువులను దొంగలు దోచుకెళ్తున్నారు. తరచూ ఇలాంటి ఘటనలు జరుగుతూనే ఉన్నాయి. సెక్యూరిటీ గార్డులు ఉన్నప్పటికీ ఇలాంటివి చోటు చేసుకుంటూనే ఉన్నాయి.

రిమ్స్‌లో రక్షణ కరువు

రిమ్స్‌లో మెడికోలతో పాటు సీనియర్‌ రెసిడెంట్లు, పీజీ వైద్యులు వసతిగృహంలో ఉంటూ చదువుతో పాటు సేవలు అందిస్తున్నారు. రెగ్యులర్‌ వైద్యులు అందుబాటులో లేనప్పటికీ వీరే అన్నీతామై రోగులకు వైద్య చికిత్సలు అందిస్తున్నారు. అయితే మెడికోలకు మాత్రం రక్షణ లేకుండా పోతోందని ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. గతేడాది అర్ధరాత్రి కొంతమంది బయటి వ్యక్తులు వసతిగృహంలోకి చొరబడి మెడికోలపై దాడికి దిగారు. పూర్తిస్థాయిలో సీసీ కెమెరాలు లేకపోవడంతో ఆ ఘటనకు సంబంధించి వ్యక్తులను గుర్తించడంలో కొంత ఆలస్యం జరిగింది. అప్పట్లో మెడికోలు పెద్ద ఎత్తున ఆందోళనకు దిగారు. మెడికోలకు రక్షణ కల్పించాలని డిమాండ్‌ చేస్తూ విధులు బహిష్కరించారు. దాడికి పాల్పడిన వారిపై కేసు నమోదు చేయడంతో శాంతించారు. కాగా రిమ్స్‌ హాస్టల్‌ వైపు 38 సీసీ కెమెరాలు ఏర్పాటు చేసినా వాటిలో కొన్ని పనిచేయడం లేదు. ఎస్‌ఎంసీ కోసం 26, రిమ్స్‌ ఓపీ విభాగంలో 28, ఇన్‌పేషెంట్‌ విభాగంలో 32 సీసీ కెమెరాలు ఏర్పాటు చేసినప్పటికీ కొంత కాలంగా అవి పనిచేయడం లేదు.

కోల్‌కతా ఘటనపై నిరసన..

కోల్‌కతాలో వైద్య విద్యార్థినిపై జరిగిన అత్యాచారం, హత్యకు సంబంధించి బుధవారం రిమ్స్‌లో మెడికోలు నిరసన చేపట్టారు. విధులు బహిష్కరించి రిమ్స్‌ డైరెక్టర్‌ చాంబర్‌ ఎదుట బైఠాయించి ఆందోళనకు దిగారు. కలకత్తాలో సంఘటన జరిగిన వైద్య కళాశాల ప్రిన్సిపాల్‌ను విధుల నుంచి తొలగించి నిందితుడిని కఠినంగా శిక్షించాలని డిమాండ్‌ చేశారు. ఇలాంటి ఘటనలు పునరావృతం కాకుండా ప్రభుత్వం చర్యలు చేపట్టాలన్నారు. రిమ్స్‌లో పోలీసులతో ప్రత్యేక భద్రత కల్పించాలన్నారు. ఈ నిరసన కార్యక్రమంలో జూడాల సంఘం అధ్యక్షుడు సందీప్‌చారి, మౌనిక, అన్వేష్‌, కార్తీక్‌, ప్రసన్న, ప్రత్యూష, నందీశ్వర్‌, కారుణ్య, తదితరులు పాల్గొన్నారు.

పోకిరీల వేధింపులు

మంచిర్యాల ప్రభుత్వ మెడికల్‌ కళాశాలలో ఎంబీబీఎస్‌ చదువుతున్న విద్యార్థినులకు పోకిరీల నుంచి వేధింపులు తప్పడంలేదు. జిల్లా కేంద్రంలోని కాలేజీరోడ్డులో రెండేళ్ల క్రితం ప్రారంభించిన మెడికల్‌ కళాశాలకు సమీపంలోనే అమ్మాయిలు, అబ్బాయిలకు వేర్వేరుగా హాస్టళ్లు నిర్వహిస్తున్నారు. కళాశాల నుంచి హాస్టల్‌కు నడుచుకుంటూ వెళ్తున్న సమయంలో పోకిరీలు బైక్‌లపై వేగంగా వస్తూ, హారన్‌ మోగిస్తూ ఇబ్బందులకు గురిచేస్తున్నారు. కాలేజీ ఆవరణలోనే విద్యార్థినులకు హాస్టల్‌ సౌకర్యం కల్పించాల్సి ఉండగా తాత్కాలికంగా ఏర్పాటు చేసిన మెడికల్‌ కాలేజీలో ఆ సదుపాయం లేకపోవడంతో సమీపంలోని ఓ ప్రైవేటు బిల్డింగ్‌ను అద్దెకు తీసుకుని అందులో హాస్టల్‌ నిర్వహిస్తున్నారు. బస్సు సౌకర్యం కల్పించాలని విద్యార్థినుల నుంచి డిమాండ్‌ ఉంది.

భద్రత కల్పించాలి



రిమ్స్‌లో తరచూ ఏదో ఒక సంఘటన చోటు చేసుకుంటోంది. సెంట్రల్‌ ఫోర్స్‌తో ప్రత్యేక భద్రత కల్పించాలి. బయటి వ్యక్తులు హాస్టల్‌లోకి చొరబడి భయాందోళనలకు గురిచేస్తున్నారు. రిమ్స్‌ ప్రధాన గేటు ఎదుట కొందరు వ్యక్తులు మద్యం మత్తులో ఇబ్బందులకు గురిచేస్తున్నారు. అక్కడ ఫుట్‌పాత్‌ వద్ద ఏర్పాటు చేసుకున్న దుకాణాలను తొలగించాలి.

– మౌనిక, పీజీ విద్యార్థిని, ఆదిలాబాద్‌

జాగ్రత్తలు తీసుకుంటున్నాం



కాలేజీలో పూర్తిస్థాయిలో సీసీ కెమెరాలు ఏర్పాటు చేసి ఏం జరుగుతుందో పరిశీలిస్తున్నాం. కాలేజీ, హాస్టల్‌ రెండు వేర్వేరుగా ఉండడంతో విద్యార్థులు నడిచి వెళ్తున్నారు. బస్సు ఏర్పాటు చేయాలని ఉన్నతాధికారులకు విన్నవించాం. బస్సు కేటాయిస్తే వారికి మరింత రక్షణ ఉంటుంది. విద్యార్థినులు వెళ్లే సమయంలో సిబ్బంది పర్యవేక్షిస్తున్నారు.

– డాక్టర్‌ ఎండీ సులేమాన్‌, మంచిర్యాల ప్రభుత్వ మెడికల్‌ కళాశాల ప్రిన్సిపాల్‌

ప్రత్యేక దృష్టి సారిస్తున్నాం..



రిమ్స్‌లో ఎలాంటి సంఘటనలు చోటు చేసుకోకుండా ప్రత్యేక దృష్టి సారిస్తున్నాం. గతేడాది జరిగిన సంఘటనను దృష్టిలో ఉంచుకుని హాస్టల్‌ చుట్టూ, ముందు భాగంలో 38 సీసీ కెమెరాలు అమర్చాం. ప్రతీరోజు సీసీ ఫుటేజీలను పరిశీలిస్తున్నాం. బయటి వ్యక్తులు హాస్టల్‌లోనికి వెళ్లకుండా చర్యలు చేపడుతున్నాం. మూడు షిఫ్టుల్లో ఇద్దరు చొప్పున సెక్యూరిటీ గార్డులను నియమించాం. రిమ్స్‌లో ప్రత్యేక భద్రత కల్పించాలని పోలీసు అధికారులకు విన్నవించాం.

– జైసింగ్‌ రాథోడ్‌, రిమ్స్‌ డైరెక్టర్‌, ఆదిలాబాద్‌

నివేదిక అందించాలని కలెక్టర్‌ ఆదేశాలు

సాక్షి స్పందన

ఇచ్చోడ: 'కల్యాణలక్ష్మి'ని కాజేసింద్రు శీర్షికన బుధవారం 'సాక్షి'లో ప్రచురితమైన కథనానికి కలెక్టర్‌ రాజర్షిషా స్పందించారు. సంఘటనపై పూర్తి వివరాలతో నివేదిక సమర్పించాలని ఇచ్చోడ డెప్యూటీ తహసీల్దార్‌ జాదవ్‌ రామారావుకు ఆదేశాలు జారీ చేశారు. బుధవారం డీటీ జాదవ్‌రామారావు, ఆర్‌ఐ హుస్సేన్‌ బావోజీపేట్‌ ఆదివాసీ మహిళల ఆధార్‌కార్డు, కల్యాణలక్ష్మి దరఖాస్తు, వివాహాలు జరిగిన తేదీల వివరాలు సేకరించారు. శుక్రవారం పూర్తి వివరాలతో కలెక్టర్‌కు నివేదిక అందజేయనున్నట్లు వారు పేర్కొన్నారు.

ఇంటెలిజెన్స్‌, ఏసీబీ ఆరా...

కల్యాణలక్ష్మి కాజేసిన సంఘటనలో ఇంటెలిజెన్స్‌, ఏసీబీ అధికారులు సైతం ఆరా తీసినట్లు సమాచారం. ఆదివాసీ మహిళల ఆధార్‌కార్డుల ద్వారా డబ్బులు డ్రా చేసుకున్న వారెవరు? ఎవరి బ్యాంక్‌ అకౌంట్లో డబ్బులు జమ అయ్యాయి.. తదితర వివరాలు సేకరించినట్లు తెలుస్తోంది.

'జాతీయ చిహ్నం' పునర్నిర్మాణం

బోథ్‌: మండల కేంద్రంలోని ప్రభుత్వ ఉన్నత పాఠశాలలో 1977–78 సంవత్సరంలో చదివిన విద్యార్థులు పాఠశాల ఆవరణలో జాతీయ చిహ్నంతో కూడిన స్తూపాన్ని పునర్నిర్మించారు. గతంలో ప్రభుత్వ ఉన్నత పాఠశాల, ప్రభుత్వ జూనియర్‌ కళాశాల భవనాలు శిథిలావస్థకు చేరుకోవడంతో భవనాలను కూల్చివేసి మైదానంలోనే మరోచోట భవనాలను నిర్మించారు. ఇదివరకు ఉన్న జాతీయ చిహ్నంతో కూడిన స్తూపం శిథిలావస్థకు చేరుకుంది. దీంతో పూర్వ విద్యార్థులు మళ్లీ పునర్నిర్మించారు.



పాఠశాలలో ఏర్పాటు చేసిన స్తూపం

222 క్వింటాళ్ల పీడీఎస్‌ బియ్యం పట్టివేత

లక్ష్మణచాంద: మండలంలోని పొట్టపెల్లి కేలో బుధవారం విజిలెన్స్‌, ఎన్‌ఫోర్స్‌మెంట్‌ అధికారులు సంయుక్తంగా దాడులు నిర్వహించి పెద్ద ఎత్తున పీడీఎస్‌ బియ్యం పట్టుకున్నారు. రైస్‌ మిల్‌ యజమాని చిలమంతుల హరిక్రిష్ణ, డ్రైవర్‌ మహేష్‌ లబ్ధిదారుల నుంచి బియ్యం సేకరించి రైస్‌మిల్లులో నిల్వచేసినట్లు తమకు అందిన సమాచారం మేరకు కరీంనగర్‌ విజిలెన్స్‌ టీం సీఐ ప్రశాంత్‌రావు ఆధ్వర్యంలో తనిఖీ నిర్వహించారు. ఈ సందర్భంగా రైస్‌ మిల్‌లోకి అన్‌లోడ్‌ చేయడానికి వచ్చిన టాటా ఏస్‌ వాహనంతో పాటు రైస్‌మిల్లులో నిలువ ఉంచిన 222 క్వింటాళ్ల పీడీఎస్‌ బియ్యాన్ని స్వాధీనం చేసుకున్నారు. బియ్యాన్ని ఎంఎల్‌ఎస్‌ పాయింట్‌కు, వాహనాన్ని లక్ష్మణచాంద పోలీస్‌ స్టేషన్‌కు తరలించి రైస్‌మిల్‌ యజమాని హరిక్రిష్ణ, డ్రైవర్‌ మహేష్‌పై కేసు నమోదు చేసినట్లు సీఐ తెలిపారు. కార్యక్రమంలో ఎన్‌ఫోర్స్‌మెంట్‌ డీటీ కార్తీక్‌రెడ్డి, విజిలెన్స్‌ హెడ్‌ కానిస్టేబుల్‌ శ్రీనివాస్‌, కానిస్టేబుల్‌ సంపత్‌, తదితరులు పాల్గొన్నారు.



రైస్‌మిల్లులో పట్టుకున్న బియ్యంతో సీఐ

108లో మహిళ ప్రసవం

సారంగపూర్‌: మండలంలోని కుప్టి గ్రామానికి చెందిన అశ్వినికి బుధవారం తెల్లవారు జామున పురిటినొప్పులు రావడంతో కుటుంబ సభ్యులు 108కు సమాచారం అందించారు. అంబులెన్స్‌లో నిర్మల్‌ ప్రసూతి ఆస్పత్రికి తరలిస్తుండగా మార్గమధ్యలో చించోలి(బి) సమీపంలో నొప్పులు ఎక్కువయ్యాయి. దీంతో అప్రమత్తమైన ఈఎంటీ ప్రభాకర్‌, పైలట్‌ సంతుజ్ఞానేశ్వర్‌ సదరు మహిళకు పురుడు పోయడంతో పండంటి మగబిడ్డకు జన్మనిచ్చింది. వెంటనే తల్లీ బిడ్డలను నిర్మల్‌ ప్రసూతి ఆస్పత్రికి తరలించి చికిత్స అందించారు. 108 సిబ్బందికి మహిళ కుటుంబ సభ్యులు, గ్రామస్తులు కృతజ్ఞతలు తెలిపారు.



బాబును చూపిస్తున్న 108 సిబ్బంది

విద్యార్థులకు తప్పిన పెను ప్రమాదం



మంటలు ఆర్పుతున్న ఫైర్‌ సిబ్బంది

ఉట్నూర్‌రూరల్‌: మండల కేంద్రంలోని కేబీ ప్రాంగణంలో గల మేనేజ్‌మెంట్‌ వసతి గృహంలో బీఎడ్‌ కళాశాల విద్యార్థులకు పెను ప్రమాదం తప్పింది. బుధవారం ఉదయం వంట చేస్తున్న సమయంలో గ్యాస్‌ లీకేజీ కావడంతో ఒక్కసారిగా మంటలు చెలరేగాయి. అప్రమత్తమైన విద్యార్థులు వెంటనే 100కు సమాచారం అందించారు. డయల్‌ 100 కానిస్టేబుల్‌ నారాయణ్‌ జాదవ్‌, భీంనాయక్‌లు ఫైర్‌ సిబ్బందితో కలిసివెళ్లి మంటలు ఆర్పివేయడంతో పెను ప్రమాదం తప్పింది.

యువతి అదృశ్యం



సౌజన్య (ఫైల్‌)

బోథ్‌: మండలంలోని పార్డి బి గ్రామానికి చెందిన తొడసం సౌజన్య అనే యువతి అదృశ్యమైనట్లు పోలీసులు పేర్కొన్నారు. పోలీసులు తెలిపిన వివరాల మేరకు సదరు యువతి ఈ నెల 2న డీఎస్సీ పరీక్ష రాసి ఇంటికి వచ్చింది. 9న ఇంటి నుంచి బయటకు వెళ్లి మళ్లీ తిరిగిరాలేదు. కుటుంబ సభ్యులు బంధువులు, తెలిసిన చోట వెతికినా ఆచూకీ లభించలేదు. దీంతో బుధవారం సదరు యువతి తండ్రి బండు పోలీస్‌ స్టేషన్‌లో ఫిర్యాదు చేశాడు. కేసు నమోదు చేసుకుని దర్యాప్తు జరుపుతున్నట్లు ఎస్‌ఐ రాము తెలిపారు.

స్వగ్రామం చేరిన మృతదేహం



రాజేశ్వర్‌ (ఫైల్‌)

ఖానాపూర్‌: దుబాయ్‌లో మృతి చెందిన ఖానాపూర్‌ వాసి మృతదేహం బుధవారం స్వగ్రామం చేరుకుంది. మండలంలోని గోసంపల్లె పంచాయతీ పరిధిలోని నడింపల్లెకు చెందిన పులకం రాజేశ్వర్‌ (42)కు ఈ నెల 8న దుబాయ్‌లో గుండెపోటుతో మృతి చెందాడు. బుధవారం మృతదేహాన్ని స్వగ్రామానికి తీసుకురావడంతో కుటుంబ సభ్యుల రోదనలు మిన్నంటాయి. మృతునికి భార్య ప్రవళిక, కూతురు, కుమారుడు ఉన్నారు. బాధిత కుటుంబాన్ని ప్రభుత్వ పరంగా ఆదుకోవాలని స్థానికులు కోరుతున్నారు.

అక్రమ నిర్మాణాల తొలగింపు

ముధోల్‌: మండల కేంద్రంలోని బస్టాండ్‌ సమీపంలోగల డ్రైనేజీపై నిర్మించిన అక్రమ నిర్మాణాలను బుధవారం గ్రామస్తులు పొక్లెయిన్‌తో తొలగించారు. డ్రైనేజీపై అక్రమ నిర్మాణాల కారణంగా వర్షపు నీరు రోడ్డుపై చేరి పారిశుధ్యం అస్తవ్యస్తంగా మారుతోందని వారు తెలిపారు. జనావాసాల్లో మురుగునీరు నిల్వ ఉంటోందని పేర్కొన్నారు. ఎన్నిసార్లు చెప్పినా నిర్మాణాలు తొలగించకపోవడంతో సమస్య పరిష్కారానికి తామే పూనుకున్నట్లుతెలిపారు.



పొక్లెయిన్‌తో నిర్మాణాలు తొలగిస్తున్న గ్రామస్తులు